వృత్తిదారులకు రూ.9.31 కోట్ల లబ్ధి

- 'చేదోడు'తో ఆర్థిక స్వావలంబన
- రజక, నాయీబ్రాహ్మణ, టైలర్ల హర్షం

ఏలూరు (టూటౌన్): నాయీబ్రాహ్మణ, రజక, టైలరింగ్ వృత్తిదారులకు ప్రభుత్వం చేదోడు పథకం ద్వారా ఆర్థిక స్వావలంబన చేకూరుస్తోంది. నవరత్నాలలో పేర్కొన్న విధంగా చేదోడు పథకం ద్వారా ఏడాదికి రూ.10 వేలు చొప్పున వరుసగా ఐదేళ్ల పాటు రూ.50 వేలు అందించనుంది. సొంత షాపులు ఉన్న నాయీబ్రాహ్మణ, రజక, టైలరింగ్ వృత్తిదారులకు వరుసగా నాలుగేళ్లు ఏడాదికి రూ.10 వేలు చొప్పున ఆర్థిక సహకారం అందించింది. తాజాగా ఈ నెల 19న కర్నూలు జిల్లా ఎమ్మిగనూరులో నాలుగో విడత జగనన్న చేదోడు నిధులను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి స్వయంగా విడుదల చేశారు. జగనన్న చేదోడు పథకంలో ఏలూరు నియోజకవర్గం పరిధిలో నాలుగు విడతల్లో మొత్తం రూ.9.31 కోట్లు మేరకు లబ్ధి చేకూరింది. ఈ నేపథ్యంలో లబ్ధిదారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



జగనన్న చేదోడు పథకంలో లబ్ధిదారులకు చెక్కు అందిస్తున్న డీఆర్‌ఓ ఎం వెంకటేశ్వర్లు (ఫైల్)



సత్రంపాడు సచివాలయి-1 పరిధిలోని టైలరింగ్ చేస్తున్న లబ్ధిదారుడు

ఏలూరు నియోజకవర్గంలో నాలుగు విడతల్లో చేదోడు లబ్ధి ఇలా..

సంవత్సరం	లబ్ధిదారులు	లబ్ధి పొందిన మొత్తం			
2020-21	2,529	రూ. 2.53 కోట్లు	2022-23	2,119	రూ. 2.20 కోట్లు
2021-22	2,116	రూ. 2.20 కోట్లు	2023-24	2,377	రూ. 2.38 కోట్లు
			మొత్తం లబ్ధి		రూ. 9.31 కోట్లు

సీఎం జగన్‌కు కృతజ్ఞతలు



జగనన్న చేదోడు పథకం ద్వారా వరుసగా నాలుగేళ్లు ఏటా రూ.10 వేలు చొప్పున ఆర్థిక సహకారం అందిస్తున్న సీఎం వైఎస్ జగన్‌కు కృతజ్ఞతలు. రజక వృత్తిలో ఒకే సారి ఇంత పెద్ద మొత్తంలో డబ్బు చూడటం సాధ్యం కాదు. కానీ ప్రభుత్వం ఒకేసారి రూ.10 వేలు ఆర్థిక సాయం చేయడం గొప్ప విషయం. పేదలపాలిట పెన్నిధి సీఎం జగన్.

– అత్రిగడ్డ దుర్గా మల్లేశ్వరి, లబ్ధిదారురాలు, 49వ డివిజన్, ఏలూరు

ప్రభుత్వ సాయం మరువలేనిది



ప్రభుత్వ సాయం మరువలేనిది. రాష్ట్ర ప్రభుత్వం జగనన్న చేదోడు పథకంలో ఏటా రూ.10 వేలు ఆర్థిక సాయం అందిస్తూ టైలరింగ్ వృత్తిదారులకు ఎంతో ఉపకారం చేస్తోంది. ఈ సహకారంతో దారాలు, వస్తువులు ఒకేసారి కొనుగోలు చేయడం వల్ల ఎంతో ఉపయోగకరంగా ఉంది. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ధన్యవాదాలు.

– దొడ్డి నాగేశ్వరరావు, టైలర్, లబ్ధిదారుడు, 35వ డివిజన్, ఏలూరు

నాయీబ్రాహ్మణులకు గుర్తింపు



వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చాక రాష్ట్రంలోని నాయీబ్రాహ్మణులకు తగిన గుర్తింపు లభించింది. నవరత్నాల్లో భాగంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హామీ ఇచ్చిన విధంగా జగనన్న చేదోడు పథకం ద్వారా అందిస్తున్న ఆర్థిక సహకారం మరువలేనిది. ప్రభుత్వ సాయం నాయీబ్రాహ్మణులు ఆర్థిక పరిపుష్టి సాధించేందుకు దోహదపడింది.

– కింజంగి రాజు, నాయీబ్రాహ్మణ సంఘం, రాష్ట్ర నాయకులు, ఏలూరు

వృత్తిదారులకు ఆర్థిక భరోసా



జగనన్న చేదోడు పథకం ద్వారా ప్రభుత్వం వృత్తిదారులకు ఆర్థిక భరోసా కల్పిస్తోంది. షాపులున్న ప్రతి నాయీబ్రాహ్మణ, రజక, టైలర్లకు ఏటా రూ.10 వేలు చొప్పున ఆర్థిక సాయం అందిస్తోంది. వృత్తి సంబంధిత పెట్టుబడి కోసం అప్పుల చేయాల్సిన అవసరంతప్పింది. అర్హతే ప్రామాణికంగా అర్హులందరికీ చేదోడు సాయం అందిస్తున్నాం.

– ఎస్ పుష్పలత, ఈడీ, బీసీ కార్పొరేషన్, ఏలూరు

క్లుప్తంగా

సొంతబిడ్డ కన్నా మిన్నగా చూసుకోవాలి



చిన్నారిని ఎత్తుకున్న కలెక్టర్ ప్రసన్న వెంకటేష్

ఏలూరు(మెట్రో): దత్తత చిన్నారిని సొంతబిడ్డ కన్నా మిన్నగా చూసుకోవాలని అర్జీదారులకు కలెక్టర్ వె..ప్రసన్న వెంకటేష్ సూచించారు. ఏలూరు శిశుగృహంలో ఉన్న నాలుగు నెలల చిన్నారి చంద్రికను స్థానిక కలెక్టరేట్‌లో మహారాష్ట్రకు చెందిన అర్జీదారులు శ్రీనివాస్ దేశముఖ్, అశ్వని దేశముఖ్ దంపతులకు శనివారం జిల్లా కలెక్టర్, జిల్లా దత్తత అధికారి సమక్షంలో దత్తత ఇచ్చారు. కార్యక్రమంలో మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ, సాధికారతాధికారి కె.పద్మావతి, డీసీపీఓ సీహెచ్ సూర్య చక్రవేణి, బాలల రక్షణాధికారి ఆర్.రాజేష్, అవుట్ రీచ్ వర్కర్ భార్గవి పాల్గొన్నారు.

ఇంటెలిజెన్స్ కార్యాలయానికి స్థల పరిశీలన

ఏలూరు(మెట్రో): ఏలూరులో ఇంటెలిజెన్స్ బ్యూరో కార్యాలయం నిర్మాణానికి అవసరమైన భూమిని జాయింట్ కలెక్టర్ బి.లావణ్యవేణి శనివారం అధికారులతో కలిసి పరిశీలించారు. అల్లూరి సీతారామరాజు స్టేడియం సమీపంలో ఇరిగేషన్ కార్యాలయం వద్ద ఇంటెలిజెన్స్ బ్యూరో కార్యాలయం ఏర్పాటుకు ప్రభుత్వం 16 సెంట్ల భూమిని మంజూరు చేసిందని, ఆ భూమిని అధికారుల సమక్షంలో పరిశీలించామని జేసీ చెప్పారు. డిప్యూటీ తహసీల్దార్ గాయత్రి, సర్వేయర్ విశ్వనాథ్ పాల్గొన్నారు.

పేదలకు ఆరోగ్య భద్రత

ఏలూరు రూరల్: జగనన్న ఆరోగ్య సురక్ష విజయవంతంగా కొనసాగుతోందని తహసీల్దార్ బి.సోమశేఖర్ అన్నారు. శనివారం పోణంగిలో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం నిర్వహించారు. సుమారు 300 మందికి వైద్య సేవలు అందించి, మెడికల్ రిపోర్టులు అందించారు. ఈ సందర్భంగా ఏఎంసీ వైస్ చైర్మన్ కంచన రామకృష్ణ మాట్లాడుతూ పేదల ముంగిట వైద్య సేవలు తీసుకొచ్చిన ఘనత సీఎం జగన్‌మోహన్‌రెడ్డికే దక్కిందన్నారు. ఆరోగ్య సురక్ష పేదలకు ఆరోగ్య భద్రత కల్పించిందని నాయకులు దారం తేజ అన్నారు.

హేలాపురి బాలోత్సవం సావనీర్ విడుదల



సావనీర్ విడుదల చేసిన ఎస్పీ, ఎమ్మెల్సీ

ఏలూరు (టూటౌన్) : హేలాపురి బాలోత్సవం మూడో పిల్లల సంబరాలు సావనీర్‌ను జిల్లా ఎస్పీ డి.మేరీ ప్రశాంతి చేతుల మీదుగా శనివారం విడుదల చేశారు. ఎస్పీ మేరీ ప్రశాంతి మాట్లాడుతూ పిల్లలో సృజనాత్మకతను పెంచేందుకు పెద్దలు పూనుకుంటున్నందుకు అభినందించారు. చిన్ననాటి నుంచి ఇటువంటి కార్యక్రమాల్లో పాల్గొనడం వల్ల చిన్నారుల్లో దాగిఉన్న నైపుణ్యాలు వెలికి వస్తాయన్నారు. ఎమ్మెల్సీ షేక్ సాబ్జి మాట్లాడుతూ ఏలూరు, పరిసర ఆరు మండలాలకు చెందిన విద్యార్థులు రోజుకు నాలుగు వేల మంది పాల్గొనేలా రెండు రోజులు నిర్వహించే బాలోత్సవ కార్యక్రమాన్ని వివరించారు.

వివిధ రూపాల్లో అమ్మవార్ల దర్శనం

ఏలూరు (ఆర్ఆర్‌పేట): శ్రీదేవీ శరన్నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా శనివారం నగరంలో వివిధ ఆలయాల్లో అమ్మవార్లు వివిధ రూపా ల్లో పూజలు అందుకున్నారు. 12 పంపుల సెంటర్‌లోని కనకదుర్గ అమ్మవారు మంగళగౌరీ దేవి అలంకరణలో, పవర్‌పేట వాసుదేవాలయం ప్రాంగణంలోని రాజ్యలక్ష్మి అమ్మవారు మహాచండీ దేవిగా, పవర్‌పేటలోని కాశీ అన్నపూర్ణ సమేత విశ్వేశ్వర స్వామి దేవస్థానంలో అమ్మవారు రాజరాజేశ్వరి దేవిగా, ఆర్ఆర్‌పేట శ్రీమత్ మార్కండేయ వేద పాఠశాలలో, పత్తేబాద కనకదుర్గ ఆలయంలో అమ్మవార్లు లలితా త్రిపుర సుందరీ దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. కుంకుమ పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు.

రూపాయి నాణేలతో మోడల్ హౌస్



మోడల్ హౌస్‌తో శ్యామ్‌ప్రసాద్

ఏలూరు రూరల్: ప్రత్తికోళ్లలంకకు చెందిన బొద్దూరి శ్యామ్‌ప్రసాద్ చాంపియన్ ఆఫ్ వరల్డ్, తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో చోటు సాధించారు. ఫెవీకిక్ గమ్ ఉపయోగించి 2700 రూపాయి నాణేల తో 36 అంగుళాలు పొడవు, 24 అంగుళాలు వెడల్పు, 24 అంగుళాలు ఎత్తుతో మోడల్ హౌస్ తయారుచేసి గుర్తింపు పొందారు. దీనికి అక్టోబర్ 1 నుంచి 4 వరకు 98 గంటల పాటు శ్రమించారు. సీఆర్ఆర్ కాలేజీలో డిగ్రీ ఫైనల్ ఇయర్ చదువుతున్న శ్యామ్ ప్రసాద్ విద్యార్థి దశలో సైతం హరిత గృహ వ్యవసాయం పేరుతో చెక్కతో ఇల్లు తయారు చేసి పలు మెమెంటోలు, పతకాలు సాధించారు.

వర్షాభావం ఉన్న వరి చేలో యూరియా చల్లండి

ఏలూరు (మెట్రో): ప్రస్తుత వర్షాభావ పరిస్థితుల్లో వరి చేలల్లో రెండు శాతం యూరియా లేదా పొటాషియం నైట్రేట్‌లను పిచికారీ చేసి పంటను రక్షించుకోవాలని జేడీఏ వై.రామకృష్ణ రైతులకు సూచించారు. పంటలపై వర్షాభావ పరిస్థితుల ప్రభావం – చేపట్టాల్సిన చర్యలు అనే అంశంపై ఏలూరులోని జిల్లా వ్యవసాయ శాఖ కార్యాలయంలో శనివారం ఆచార్య ఎన్‌జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం శాస్త్రవేత్తలు, ఏలూరు జిల్లా ఏడీఏలతో నిర్వహించిన వర్కుషాపులో ఆయన మాట్లాడారు. కాలువ చివరి భూములలో మధ్యస్థ కాల పరిమితి రకాలను సాగుచేయడం ఉత్తమం అన్నారు. ఖరీఫ్‌కు సరిపడా సాగునీరు అందుబాటులో ఉందని చెప్పారు. మార్టేరు సహ పరిశోధనా సంచాలకులు డాక్టర్ ఎం.భరతలక్ష్మి, విజయరాయి వ్యవసాయ పరిశోధనా స్థానం ప్రధాన శాస్త్రవేత్త కె.మోహనరావు, ఏరువాక కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ టి.సుజాత పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి

ఎమ్మెల్యే ఆళ్ల నాని



ఏలూరు టౌన్: ఏలూరు నియోజకవర్గంలో ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నట్టు ఎమ్మెల్యే ఆళ్ల నాని అన్నారు. ఏలూరు శ్రీరామ్‌నగర్‌లోని క్యాంపు కార్యాలయంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాలపై అధికారులతో నాని సమీక్షించారు. ఏలూరులోని 3వ సచివాలయం పరిధిలో రూ.50 లక్షలు అభివృద్ధి పనులు, వెంకటాపురం-1 సచివాలయం పరిధిలో రూ.60 లక్షలు నిధులతో అభివృద్ధి పనులు చేపట్టేందుకు ఆమోదం తెలిపామని నాని చెప్పారు. త్వరలోనే అభివృద్ధి పనులు ప్రారంభించాలని అధికారులను ఆదేశించారు. సమావేశంలో ఏలూరు డిప్యూటీ మేయర్ నూకపెయ్యి సుధీర్ బాబు, ఏఎంసీ చైర్మన్ నెరుసు చిరంజీవి, పార్టీ జిల్లా కోశాధికారి మంచెం మైబాబు, నగర అధ్యక్షుడు బొద్దాని శ్రీనివాస్, ఏలూరు క్లస్టర్-1 అధ్యక్షుడు సుంకర చంద్రశేఖర్, కోఆప్షన్ సభ్యులు మున్నుల జాన్‌గురునాథ్, కార్పొరేటర్లు తదితరులు ఉన్నారు.

నేడు వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ ప్రాంతీయ సదస్సు

ఏలూరు టౌన్: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తోన్న సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లి సామాజిక చైతన్యం తీసుకొచ్చేందుకు కృషి చేస్తున్నామని వైఎస్సార్‌సీపీ ఏలూరు జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు తేరా ఆనంద్ అన్నారు. ఎమ్మెల్యే ఆళ్ల నాని సహకారంతో ఏలూరులో ఆదివారం చేపట్టే ఎస్సీ సెల్ ప్రాంతీయ సదస్సును విజయవంతం చేయాలని కోరారు. ఎస్సీ సెల్ ఏలూరు నగర అధ్యక్షుడు పొలిమేర దాసు, కోఆప్షన్ సభ్యుడు మున్నుల జాన్‌గురునాథ్, మాదేపల్లి సర్పంచ్ కోరపాటి ప్రభుదేవాతో కలిసి ఏలూరులో ఆయన మాట్లాడారు. ఏలూరు శనివారపుపేట సారథి కళ్యాణ మండపంలో ఉదయం 10 గంటలకు ప్రారంభమవుతుందని చెప్పారు. పార్టీ రాష్ట్ర ఎస్సీ సెల్ అధ్యక్షుడు, ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్, సామాజిక సలహాదారు జూపూడి ప్రభాకరరావు, ఎంపీ నందిగం సురేష్, ఎమ్మెల్సీ డాక్టర్ మొండితోక అరుణ్‌కుమార్ హాజరవుతారని తెలిపారు. ఏలూరు నగరం, జిల్లాలోని ఎస్సీ సామాజిక వర్గం ప్రజలు, వైఎస్సార్‌సీపీ శ్రేణులు హాజరవుతారని తెలిపారు.

3న స్టేట్ లెవెల్ ఎడ్యుకేషన్ ఎచీవ్‌మెంట్స్

ఏలూరు రూరల్: జిల్లా వ్యాప్తంగా 29,139 మంది విద్యార్థులకు స్టేట్ లెవెల్ ఎడ్యుకేషన్ ఎచీవ్‌మెంట్ (ఎస్ఈఏఎస్) పరీక్ష నిర్వహించనున్నట్టు డీఈఓ పి.శ్యామ్‌సుందర్ తెలిపారు. శనివారం ఏలూరు మండలపరిషత్ సమావేశ మందిరంలో ఎంఈఓల సమావేశంలో ఆయన మాట్లాడారు. నవంబర్ 3న నిర్వహించే ఈ పరీక్షకు 3, 6, 9 తరగతి విద్యార్థులు హాజరవుతారని చెప్పారు. గవర్నమెంట్ ఎగ్జామ్స్ అసిస్టెంట్ కమిషనర్ ఎల్ శ్రీకాంత్ మాట్లాడుతూ 10వ తరగతి ఫెయిల్ అయిన విద్యార్థులకు స్కిల్ డెవలప్‌మెంట్ ఆధ్వర్యంలో శిక్షణ చేపట్టనున్నామన్నారు. డీసీఈబీ సెక్రటరి ఎ.సర్వేశ్వరావు మాట్లాడుతూ జాతీయ స్థాయిలో 1.4 కోట్ల మంది విద్యార్థులు పరీక్ష రాయనున్నారని వివరించారు.

డీఏ విడుదలపై హర్షం

ఏలూరు (ఆర్ఆర్‌పేట): దసరా కానుకగా డీఏ విడుదల చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించడంపై వైఎస్సార్ సీపీ టీచర్స్ ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గెడ్డం సుధీర్ హర్షం వ్యక్తం చేశారు. ప్రస్తుత డీఏ కన్నా మరో 3.64 శాతానికి పెంచడం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులపై ఉన్న చిత్తశుద్ధికి నిదర్శనమని కొనియాడారు.

బ్యూటీషియన్ కోర్సులో ఉచిత శిక్షణ

ఏలూరు (ఆర్ఆర్‌పేట): స్థానిక యూనియన్ బ్యాంక్ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థలో పేద గ్రామీణ యువతులకు బ్యూటీషియన్ కోర్సులో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్టు ఆ సంస్థ డైరెక్టర్ కె.శశిధర్ ఒక ప్రకటనలో తెలిపారు. వివరాలకు సెల్ నెంబర్లు 95027 23561, 99485 65256లో సంప్రదించాలని కోరారు.